## క్లుప్తంగా

### ఎస్పీని కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



ఎస్పీ రాధికకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పరమేశ్వరరావు తదితరులు

శ్రీకాకుళం అర్బన్: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు శ్రీకాకుళం జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధికను ఆమె కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎస్పీని కలిసిన వారిలో ఆ పార్టీకి చెందిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సనపల అన్నాజీరావు, పైడి నాగభూషణరావు తదితరులు ఉన్నారు.

### నృత్య కళానికేతన్ విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న మెహెర్ ప్రభాకర్

శ్రీకాకుళం: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే సంస్కృతిక, నాట్యం సర్టిఫికెట్ డిప్లమా పరీక్షల్లో శ్రీకాకుళం మెహెర్ నృత్య కళానికేతన్ విద్యార్థినులు ప్రథమ స్థానంలో ఉత్తీర్ణులైయ్యారని కళానికేతన్ వ్యవస్థాపకుడు మెహెర్ ప్రభాకర్ బుధవారం తెలిపారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థినులు శ్రీసంహిత, అనూరాధ, వాసంతి, బెహరా ప్రీతిలను శిక్షకులు, అధ్యాపకులు అభినందించారు. మూడు జిల్లాల్లో ఇటీవల నిర్వహించిన నాట్యం సర్టిఫికెట్ పరీక్షల్లో విజయం సాధించారని ప్రభాకర్ చెప్పారు.

### సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల: మండలంలోని ధర్మవరం పంచాయతీ పరిధిలోని రామజోగిపేట, లావేటిపేట గ్రామాల్లో జి.జి.ఎం.పి నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలను ఎంపీపీ మొదవలస చిరంజీవి బుధవారం ప్రారంభించారు. రామజోగిపేటలో రూ. 2 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మించడం జరిగిందన్నారు. లావేటిపేటలో రూ.9 లక్షల వ్యయం అంచనాతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను చేపట్టనున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు ముద్దాడ శంకర్, మండల విప్ బగ్గ రాజారావు, అల్లు సూర్యానారాయణ, అరసవల్లి లక్ష్మణ్, రామారావు, మంగయ్య అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### విద్య, క్రీడల్లో రాణించాలి



బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సీతారాం

రణస్థలం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం అన్నారు. మండలంలోని జే.ఆర్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి గ్రిగ్ పోటీలు నిర్వహించారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీల విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నారని, త్వరలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మహంతి పెదరామునాయుడు, జే.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, నాయకులు చిల్ల వెంకటరెడ్డి, మహంతి చినరామినాయుడు, ఎంఈఓ-2 లావణ్య, హెచ్ఎం రమణయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### బీమా అందజేత



రూ.పది లక్షల చెక్కును అందజేస్తున్న ఎస్‌బీఐ సిబ్బంది

రణస్థలం: మండల కేంద్రంలోని జే.ఆర్.పురం పంచాయతీలోని గొల్లపేట గ్రామానికి చెందిన బేతా సంతోష్‌కుమార్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. సంతోష్ కుమార్ రణస్థలం స్టేట్ బ్యాంక్‌లో సేవింగ్ ఖాతా ద్వారా రూ.500 వ్యక్తిగత ప్రమాద బీమా చేయించారు. ఈ ప్రమాదానికి సంబంధించిన పత్రాలను బ్యాంక్ సిబ్బందికి అందజేసిన నెల రోజుల్లోనే మృతుని భార్య శ్రావణికి రూ.పది లక్షల బీమా చెక్కును బ్యాంక్ మేనేజర్ జి.హరినారాయణ బుధవారం అందజేశారు. ఎస్‌బీఐ సిబ్బంది దేశెట్టి హరిప్రసాద్, జనరల్ బీడీఎం యు.ఎల్.ఎన్.పట్నాయక్, సేవా ఫౌండేషన్ సభ్యుడు ఇదదాసుల తిరుపతిరాజు ఉన్నారు.

# సచివాలయ వ్యవస్థతో పరిపాలన వికేంద్రీకరణ

- మంత్రి ధర్మాన ప్రసాదరావు
- శ్రీకూర్మంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా పరిపాలన వికేంద్రీకరణ జరిగిందని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకూర్మం సచివాలయ పరిధిలో ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అలాగే రూ. 25 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ. 16 లక్షలతో నిర్మించిన పొందరవీధి పాఠశాల భవనం, రూ. 51 లక్షలతో నిర్మించిన జెడ్పీ పాఠశాల అదనపు భవనాలను మంత్రి ధర్మాన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. 17 నెలలుగా 'గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని.. ముగింపు శ్రీకూర్మంలో జరుగుతుందన్నారు. కార్యక్రమం విజయవంతం చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు అభినందనలు తెలియజేశారు. నాలుగున్నరేళ్లలో వచ్చిన మార్పును తెలుసుకోవడానికి వచ్చామని, 75 ఏళ్ల స్వాతంత్ర్యంలో ఏ రాజకీయ పార్టీ అధికారంలో వచ్చినా పార్టీ గుప్పిట్లోనే అధికారం ఉండేదన్నారు. బలహీనులు ఎప్పుడూ వెనుకబడి ఉండేవాళ్లని, తాము ఎన్నుకున్న పాలనలో బితుకుబితుకుమంటూ బతికేవారిలో ఇవాళ ఓ ధైర్యం వచ్చిందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పాలనలో మార్పు వచ్చిందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం క్రమం తప్పకుండా అందిస్తున్నారు. జీవన ప్రమాణాలు పెంపొందిస్తుందన్నారు. నాలుగున్నరేళ్లలో గ్రామాల్లో ఉండే పాఠశాలలు, గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇవన్నీ అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ఇవేమీ చేయలేకపోవడం వలనే ఇప్పుడు చేశామని, మరో 20 ఏళ్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటే అన్ని వ్యవస్థలు బాగుపడతాయన్నారు. నీరు- చెట్టు పేరుతో చెరువుల అభివృద్ధి అంటూ బ్రోకర్లను టీడీపీ ప్రభుత్వం తయారు చేసిందన్నారు. ప్రజల డబ్బును తమ వారికి లబ్ధి చేకూరేలా పనులు చేసేవారని, సంబంధిత పెద్దల జేబుల్లోకి డబ్బు వెళ్లేదన్నారు. ఈ ప్రభుత్వంలో కార్యకర్తలకు అటువంటి అవకాశమే లేదన్నారు. విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతనివ్వడం జరిగిందన్నారు. ఏటా జగనన్న పేరిట విద్యా కానుక అందిస్తున్నాం.

ప్రతిపక్షం ఈ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడానికి అవకాశం లేదన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న సంక్షేమ పథకాలు, అవినీతి రహిత పాలనపై ప్రతిపక్షం ఆరోపణలు చేయలేదన్నారు. చంద్రబాబు కూడా ఏ పత్రికల ద్వారా, పార్టీ సమావేశాల్లో, శాసనసభలో కూడా ఆరోపణలు చేయడానికి వీలు లేదన్నారు. అవినీతి రహితంగా పాలన జరుగుతోందన్నారు. రెండు లక్షల సచివాలయ ఉద్యోగాల నియామకం ఎంత పారదర్శకంగా జరిగిందో అందరికీ తెలుసునన్నారు. రైతులకు పెట్టుబడి సాయం అందించామని మంత్రి చెప్పారు. 31 లక్షల మందికి సొంతింటి కల నెరవేరుతోందన్నారు. మంచి మనసున్న ముఖ్యమంత్రిగా జగన్ ఉన్నారు కాబట్టే ఇది సాధ్యమైందన్నారు. సమావేశంలో పార్టీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, రాష్ట్ర కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు, పార్టీ కన్వీనర్ పీస గోపి, బరాటం నాగేశ్వరరావు, సర్పంచ్ గోరు అనిత, అందవరపు బాలకృష్ణమూర్తి, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, పీస శ్రీహరిరావు, కొయ్యాన నాగభూషణం, యాళ్ల నారాయణమూర్తి, అరవల రామకృష్ణ, ఊట అప్పలనాయుడు, రాజు, అల్లు లక్ష్మీనారాయణ, కెప్టెన్ ఎర్రన్న, ముద్దాడ గోవిందరావు, కోట రామారావు పాల్గొన్నారు.

**శ్రీకూర్మనాథుడన్ని దర్శించుకున్న మంత్రి ధర్మాన**

విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలోని శ్రీకూర్మనాథున్ని మంత్రి ధర్మాన ప్రసాదరావు బుధవారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రికి అధికారులు, అర్చకులు ఎదురేగి స్వాగతం పలికారు. మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలనంతరం కూర్మనాయకున్ని దర్శించుకున్నారు. అర్చకులు కృష్ణమాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు, కిశోర్ బాబులు ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో జి.గురునాథం, పాలకమండలి సభ్యులు పూడి కమల, బోర కృష్ణవేణి, అనుపోజు నాగరాజు, ఉప్పాడ రవి పాల్గొన్నారు.



శ్రీకూర్మనాథాలయంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు



పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు

## నివాసయోగ్యమైన నగరంగా తీర్చిదిద్దుదాం

- ప్రపంచ టౌన్‌ప్లానింగ్‌డేలో కమిషనర్ ఓబులేసు



మాట్లాడుతున్న కమిషనర్ ఓబులేసు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం కార్పొరేషన్‌ను నివాస యోగ్యమైన నగరంగా తీర్చిదిద్దడమే అందరి లక్ష్యమని కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. వరల్డ్ టౌన్‌ప్లానింగ్ డే కార్యక్రమాన్ని కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించి కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనిషి పుట్టినప్పటినుంచి మరణించేంతవరకు ప్లానింగ్ తప్పనిసరి అన్నారు. అప్పుడే ఓ మంచి సమాజం నిర్మాణం సాధ్యమవుతోందన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్పొరేషన్‌ను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. నగరం విస్తరణ సులువుగా అభివృద్ధి జరగాలంటే నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టేలా చూడాల్సిన బాధ్యత టౌన్‌ప్లానింగ్ ఇంజినీర్లపై ఉందన్నారు. ఎక్కడా ఎటువంటి అక్రమ నిర్మాణాలకు తావులేకుండా నిర్మాణదారులకు ముందుగానే అవగాహన కల్పించాలన్నారు. నిబంధనల మేరకే నిర్మాణాలు జరిగేలా చూడాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పాలన్నారు. ఇప్పటికే సర్క్యులేషన్ పేట్రన్‌ను అమల్లోకి తీసుకొచ్చామని, కొత్తమాస్టర్‌ప్లాన్‌ను అమల్లోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. శ్రీకాకుళం నగర స్వాగత బోర్డులు, ఆర్చిలు రెండు నెలల్లో పూర్తిచేసి 2024 జనవరి నాటికి పనులు పూర్తిచేసి వెలకమ్ చెప్పేలా చేస్తామన్నారు. ఒక్కో ఇంజినీర్ ఒక్కో వెల్‌కమ్ బోర్డు, ఆర్చిల నిర్మాణ బాధ్యత తీసుకోవాలన్నారు. అందుకు కార్పొరేషన్ నిధులు సమకూర్చుతోందన్నారు. ఈ సందర్భంగా టౌన్‌ప్లానింగ్, లైసెన్సుడు ఇంజినీర్లకు వరల్డ్ టౌన్‌ప్లానింగ్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. టౌన్ ప్లానింగ్ డే సందర్భంగా డీసీసీబీ కాలనీలో కార్పొరేషన్ అధికారులు మొక్కలు నాడారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారి ఏసీపీ రమణమూర్తి, టీపీవో ఉమామహేశ్వరరావు, ఎంఈ పి.సుగుణాకరరావు, లైసెన్సుడు ఇంజినీర్ల సంఘ అధ్యక్షుడు హారికా ప్రసాద్, ముని శ్రీనివాసరావు, క్రెడాయ్ జిల్లా అధ్యక్షుడు చక్రవర్తి, ఎల్‌టీపీలు పాల్గొన్నారు.

## మొక్కల పెంపకానికి ప్రాధాన్యం

ఎచ్చెర్ల: ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మొక్కల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఉద్యానవన అధికారి శ్యామల తెలిపారు. గురుగుబిల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పెంచుతున్న మొక్కలను బుధవారం పరిశీలించారు. మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించాలన్నారు. చెరువు గట్లుపైన, పాఠశాలల్లోని ఖాళీ స్థలాల్లో నాటిన మొక్కలను సంరక్షించక పోవటం వల్ల చాలా వరకు చనిపోతున్నాయన్నారు. టీఏ గొరినాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్లు రామారావు, సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్‌గేమ్స్ పరిశీలకుడిగా జనార్దన్



గొండు జనార్దన్

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర స్కూల్‌గేమ్స్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు పరిశీలకుడిగా జిల్లాకు చెందిన సమగ్రశిక్ష పీఈటీ గొండు జనార్దన్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తి ఉత్తర్వులు వెలువరించారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని జోగింపేట ట్రైబల్ రెసిడెన్షియల్ స్కూల్ వేదికగా ఈ నెల 9 నుంచి 11 వరకు పోటీలు జరగనున్నాయి. జనార్దన్ గార జెడ్పీహెచ్ స్కూల్‌లో పీఈటీగా పనిచేస్తున్నారు.

## జాతీయ పోటీల్లోనూ సత్తాచాటాలి



సాఫ్ట్‌బాల్ క్రీడాకారులను అభినందిస్తున్న డీఈవో వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో చూపించిన పోరాట ప్రతిభతో జాతీయ పోటీల్లోనూ రాణించాలని డీఈఓ కె.వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. ఒంగోలులో ఈ నెల 4 నుంచి 6 వరకు ఏపీ రాష్ట్ర స్కూల్ గేమ్స్ అండర్-17 బాలబాలికల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్-2023 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో శ్రీకాకుళం బాలురు జట్టు రన్నరప్‌గా నిలిచి రజత పతకం సాధించింది. అత్యుత్తమ ఆటతీరుతో ఆకట్టుకున్న ఎం.యస్వంత్ (కేశవరావుపేట), ఎస్.మధుసూదనరావు (తాడివలస), వై.లక్ష్మీప్రసాద్ (కేశవరావుపేట), పి.రేణుక (కేశవరావుపేట) జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని డీఈఓ బుధవారం అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు ఎం.వి.రమణ, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా స్కూల్‌గేమ్స్ సెక్రటరీ బి.వి.రమణ, కోచ్ మేనేజర్లుగా వ్యవహరించిన పీడీలు ఎస్.రామరాజు(ఎస్ఎస్‌వలస), జి.మల్లేష్ (కేశవరావుపేట), డి.పెంటయ్య (తాడివలస), ఎ.రాజగోపాల్ (ఎస్ఎస్ఆర్ పురం), ఆర్.సింహాద్రినాయుడు (ఎచ్చెర్ల) పాల్గొన్నారు.


## ఉపాధి పనుల గుర్తింపు

ఎచ్చెర్ల క్యాంపస్: సంతసీతారంపురంలో ఉపాధి హామీ పథకం పనులు గుర్తించేందుకు బుధవారం గ్రామ సభ నిర్వహించారు. చెరువులు, రోడ్లులు, మట్టిపని, మెటీరియల్ కంపోనెంట్, సిమెంట్ నిర్మాణాల అవసరాలను గుర్తించారు. ఈ మేరకు అధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు సర్పంచ్ దుంప అప్పయ్యమ్మ తెలిపారు. 2024-25 ఏడాదికి ఉపాధి పనులు గుర్తించి జాబితాలు ఇవ్వాలని, గ్రామాలు ప్రగతి చెందాలంటే ఈ పథకం సద్వినియోగం చేయాలని ఉపాధి హామీ ఏపీఓ శోభాదేవి తెలిపారు. గ్రామ పెద్దలు, పంచాయతీ పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

**దవళపేటలో..**

జి.సిగడాం: గ్రామాల్లో అర్హులైన వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తున్నామని ఏపీఓ బోళ్ల సత్యనారాయణ అన్నారు. మండలంలోని దవళపేట గ్రామంలో సర్పంచ్ వడిశ మహేశ్వరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఉపాధి హామీ పథకం కార్యచరణ ప్రణాళికల సమావేశం బుధవారం నిర్వహించారు. గ్రామాభివృద్ధికి అందరి సహకారం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పేడాడ శ్రీనివాసరావు, నాయకులు పేడాడ కృష్ణంరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర పంటలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రీజనల్ మేనేజర్ ప్రకాష్‌రావు

రణస్థలం: మొక్కజొన్న, ఆపరాలలో అంతర పంటలను ఏ విధంగా వేసుకోవాలో ప్రకృతి వ్యవసాయ రీజనల్ మేనేజర్ ప్రకాష్‌రావు, టెక్నికల్ అధికారి హేమసుందర్ అవగాహన కల్పించారు. రణస్థలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న చుట్టూ మూడు వరసల్లో సజ్జలు, జొన్నలు వేసుకోవాలని, ఇలా వేసుకోవడం వల్ల మిత్ర కీటకాలను అభివృద్ధి చేయవచ్చన్నారు. పక్క పొలాల నుంచి పురుగులు, వైరస్ రాకుండా ముందగానే నివారించుకోవచ్చని వివరించారు. ఒక ఎకరా విస్తీర్ణంలో ముల్లంగి, గోరు చిక్కుడు, బెండ, ఆకు కూరలను పండించుకోవచ్చని తెలిపారు. మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ, యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

## అర్థమయ్యేలా బోధన ఉండాలి

ఎచ్చెర్ల: అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు అందిస్తున్న పూర్వ ప్రాథమిక విద్యాబోధన అర్థమయ్యేలా ఉండాలని లెర్నింగ్ కో-ఆర్డినేటర్ కరుణాకరరావు అన్నారు. బెజ్జిపురం యూత్‌క్లబ్, ఇండియా లిటరసీ ప్రాజెక్ట్ (బెంగుళూరు) సహకారంతో స్కూల్ రెడీనెస్, బాలవికాస్ ప్రోగ్రామ్ బుధవారం నిర్వహించారు. ఎచ్చెర్ల మండలంలోని పూర్వప్రాథమిక తరగతులను బోధిస్తున్న 30 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు సీడీఎఫ్ మోడల్, కృత్యాధార బోధన పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు ఆటపాటలతో, గేయాలతో అర్థమయ్యే రీతిలో బోధన చేయాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలతో మెరుగైన బోధన అందించాలన్నారు. ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.మాధవి, కమ్యూనిటీ ఆర్గనైజర్ వై.శంకరరావు, ఎ.రమణమూర్తి, కె.శ్రావణి, ఆర్.కల్పన, ఆర్.వనిత, ఉమామహేశ్వరరావు, హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ధర్మానను కలిసిన పెన్షనర్ల సంఘ సభ్యులు



మంత్రి ధర్మానకు వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్లు

శ్రీకాకుళం రూరల్: పెన్షనర్లకు డిజిటలేషన్ కార్యాలయం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావును తన క్యాంపు కార్యాలయంలో సంఘం సభ్యులు ఆర్.రామచంద్రరావు, డి.ధర్మారావు, మోహన్‌రావు తదితరులు బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లాలోని 11 సంఘాల ట్రెజరీ, మండలస్థాయి సంఘాలతో కలిసి పెన్షనర్ల సంఘం పనిచేస్తోందన్నారు. సభ్యులందరూ ఒకేచోట ఉంటూ పెన్షనర్ల సేవలు ఆన్‌లైన్ చేసేందుకు వీలుగా డిజిటలేషన్ కార్యాలయం ఏర్పాటు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. త్వరలోనే ప్రస్తుత కలెక్టర్ కార్యాలయం నూతన భవనంలోకి మారనున్న నేపథ్యంలో ఖాళీ అయిన పాత కలెక్టర్ కార్యాలయాన్ని తమకు కేటాయించాలని కోరారు.

## సీఎం జగన్‌తోనే ప్రజా సంక్షేమం

- వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు రామ్‌మనోహర్‌నాయుడు



బ్రోచర్లను అందజేస్తున్న రామ్‌మనోహర్‌నాయుడు, ఎం.వి. పద్మావతి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బడుగు, బలహీనవర్గాల అభివృద్ధిని ఆకాంక్షించే నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. జగన్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమన్నారు. పేద ప్రజలంతా అభివృద్ధిబాటలో ఉండాలన్న సంకల్పంతో నవరత్నాలు రూపొందించారన్నారు. శ్రీకాకుళం నగరం 23వ డివిజన్ మండలవీధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'151వ రోజు కార్యక్రమం బుధవారం జరిగింది. ఇంటింటికీ వెళ్లి సంక్షేమాన్ని వివరించారు. ఇప్పటివరకు ఎక్కడా లేని విధంగా ఒక్కో వలంటీర్‌తో డివిజన్ ఇన్‌చార్జిలు వెళ్లి ప్రతి ఇంటి వద్ద వారికి ఉన్న సమస్యలను నోట్ చేసుకుని సమస్య ఎన్ని రోజుల్లో పరిష్కరిస్తారో చెప్పి వెళ్లారు. ఈ సందర్భంగా రామ్‌మనోహర్‌నాయుడు మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావిస్తూ రాష్ట్రంలో పాలన సాగుతోందన్నారు. చంద్రబాబు చెప్పేది ఒకటి.. చేసేది మరొకటని వ్యాఖ్యానించారు. హామీలివ్వడం విస్మరించడం బాబుకి వెన్నతోపెట్టిన విద్య అన్నారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి మాట్లాడుతూ.. మహిళకు డ్వాక్రా రుణాలు, వడ్డీ మాఫీ చేసిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అన్నారు. ప్రభుత్వం అందించే అమ్మఒడి, జగనన్న ఇళ్లు, చేయూత వంటి అనేక పథకాలు మహిళల ఖాతాల్లో వేసి కుటుంబాన్ని సజావుగా నడిపించేలా చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. సంక్షేమ రాజ్యాన్ని, జగన్ పాలనను చూసి ఓర్వలేక టీడీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి. స్వరూప్, పార్టీ ఎస్సీసెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రుషి, నాయకులు సాధు వైకుంఠరావు, టంకాల బాలకృష్ణ, ద్వారపు అజిత్, ఎండ రమేష్, కొండాల గణేష్, శోభన్‌బాబు పాల్గొన్నారు.

## నేటినుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్'

- విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుల పిలుపు



రణస్థలం: మాట్లాడుతున్న సాయికుమార్

రణస్థలం: గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో సమస్యలు గుర్తించి, సత్వర పరిష్కారం దిశగా చేపడుతున్న వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు వైఎస్సార్ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం విధి, విధానాలపై రణస్థలంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. గురువారం జే.ఆర్.పురం-1 సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ ఉంటుందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, పార్టీ మండల అధ్యక్షులు మహంతి పెదరామినాయుడు, మండల జేసీఎస్ ఇన్‌చార్జి చిల్ల వెంకట రెడ్డి, అల్లివలస మాజీ సర్పంచ్ దుమ్ము పంజోడు తదితరులు ఉన్నారు.

**సీఎం జగన్‌తోనే భవిష్యత్తు..**

ఎచ్చెర్ల క్యాంపస్: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ఎన్నికైతేనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. కుశాలపురం బైపాస్ కూడలిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు ముద్దాడ శంకర్, మండల పరిషత్ విప్ బగ్గరాజారావు, జేసీఎస్ అధ్యక్షుడు మూగి శ్రీరాములు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు బొడ్డేపల్లి సుధాకర్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్ అంబటి రాంబాబు, మండల యువజన విభాగం అధ్యక్షుడు కొత్తకోట సూర్యారావు, డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు బోర సాయిరాం రెడి పాల్గొన్నారు.

**నేటి నుంచి పల్లెనిద్ర**

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని మొదట విడతగా పది సచివాలయాల పరిధిలో ఈ నెల 9వ తేదీ నుంచి పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టనున్నట్లు మండల ప్రత్యేక ఆహ్వానితుడు రొక్కం బాలకృష్ణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 9 నుంచి 23 వ తేదీ వరకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. 9న లావేరు-1 సచివాలయం పరిధిలో పల్లెనిద్ర ప్రారంభించనున్నామని, 10వ తేదీ ఉదయం ఈ గ్రామంలో పార్టీ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరిస్తారన్నారు. 10న లావేరు-2, 14న తాళ్లవలస, 15న గురుగుబిల్లి, 16న వెంకటాపురం, 17న పెద్దలింగాలవలస, 20న బెజ్జిపురం, 21న కొత్తకోట, 22న బుడుమూరు, 23న అదపాక సచివాలయాల్లో పల్లెనిద్ర చేయడం జరుగుతుందన్నారు. నాయకులు, సచివాలయం సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొనాలని కోరారు.

జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు దన్నాన రాజీనాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బూరాడ చిన్నారావు పాల్గొన్నారు.

**సీఎం జగన్‌తోనే సంక్షేమం**

జి.సిగడాం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సంక్షేమ పాలన సాధ్యమని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ అన్నారు. జి.సిగడాం సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. నోడల్ అధికారి ఎస్.శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటసాయి, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, ఎస్సీ సెల్ కన్వీనర్ మామిడి బలరాం, సర్పంచ్‌లు ముద్దాడ గౌరి, చిత్తిరి మోహన్, నారాయణరావు, డకర సురేష్‌కుమార్, వీఆర్ఓ భూపతి నర్సింగరావు, పంచాయతీ కార్యదర్శి తులసీప్రసాద్ సాహు పాల్గొన్నారు.

**నేటి నుంచి పల్లెనిద్ర..**

ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు మొదటి విడతలో మండలంలోని 10 సచివాలయాల్లో ఈ నెల 9 నుంచి 23 వరకు పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తామని జెడ్పీటీసీ సభ్యుడు రమణ వెల్లడించారు. 9న జి.సిగడాం, 10న నడిమివలస, 14 ఆనందపురం, 15న టీడీవలస, 16న పాలఖండ్యాం,17న సంతవురిటి, 20న సీతంపేట, 21న పెంట, 22న వాంద్రంగి, 23న ఎందువలో పల్లె నిద్ర చేస్తామన్నారు.

గార: మండలంలో గురువారం నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎంపీపీ గొండు రఘురామ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పీస గోపి తెలిపారు. మండల కేంద్రం గార సచివాలయం వద్ద గురువారం మధ్యాహ్నం కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

శ్రీకాకుళం రూరల్: వై ఏపీ నీడ్స్ జగన్ (ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే ) కార్యక్రమాన్ని గురువారం మండల పరిధిలోని సింగుపురం గ్రామంలో ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో శిమ్మ రామ్మోహన్ బుధవారం తెలిపారు. పదో తేదీన రాగోలు, 14న తండేంవలస, 15న కరజాడ, 16న లంకాం, 17న గూడేం, 20న అలికాం, 21న బైరి, 22న సింగుపురం, 23న చాపురంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

## 11న విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నగరంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ఇన్‌స్పైర్ స్కూల్ సౌజన్యంతో ఈ నెల 11వ తేదీన ఉదయం 9 గంటల నుంచి పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నామని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ గీతా శ్రీకాంత్, అన్నెపు అనంతరావు బుధవారం తెలిపారు. ఈ పోటీలకు నాలుగు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. విజేతలకు ఈనెల 14న బాలల దినోత్సవ సందర్భంగా సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో నగదు బహుమతులు అందజేస్తామన్నారు. శ్రీకాకుళం పట్టణంలోని విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నాట్య పరీక్షల్లో శివశ్రీనృత్య విద్యార్థినుల ప్రతిభ



ఉత్తీర్ణులైన విద్యార్థులతో శ్రీకాంత్

శ్రీకాకుళం కల్చరల్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఈ ఏడాది జూలైలో నిర్వహించిన వార్షిక పరీక్షల్లో నలుగురు జిల్లా టాపర్స్‌గా, ఆరుగురు ప్రథమశ్రేణిలో నిలిచినట్టు శివశ్రీనృత్య నికేతన్ నాట్య గురువు డాక్టర్ రఘుపాత్రుని శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. భరతనాట్యం డిప్లమో కోర్సులో ముగ్గురికి జిల్లా టాపర్స్‌గా, మరో ముగ్గురుకి ప్రథమశ్రేణి, కూచిపూడి డిప్లమోలో ఒకరికి జిల్లా టాపర్‌గా, ఇద్దరికి ప్రథమ శ్రేణి, కూచిపూడి సర్టిఫికేట్ కోర్సులో ఒకరికి ప్రథమ శ్రేణి వచ్చిందని అన్నారు. భరతనాట్యం డిప్లమోలో జిల్లా టాపర్స్‌గా బరాటం లలిత, వోలేటి సాహిత్య సౌమ్య, వోలేటి శృతి భారతి, ప్రథమ శ్రేణిలో ఎస్.అమృత, ఎం.ఆశ్రిత, టి.శ్రేయశ్రీ, కూచిపూడి డిప్లమోలో జిల్లా టాపర్‌గా డి.నేహా పట్నాయక్, ప్రథమ శ్రేణిలో దూలాపు హిమబిందు, మండా గాయత్రీ వర్షిత, కూచిపూడి సర్టిఫికెట్ కోర్సులో వమరవల్లి చాందిని నిలిచారన్నారు. వీరిని నాట్య గురువు శ్రీకాంత్, పిల్లల తల్లిదండ్రులు అభినందించారు.